

# మీరు చూడజాలని గోడలకు ఆవల

## పూర్వాభిప్రాయాన్ని విశాల దృక్పథం భర్తీ చేసినప్పుడు

**దాజీ**

షాజహాన్‌పూర్ యోగాశ్రమం
స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా సందేశం
5 వ బ్యాచ్: 2026, ఫిబ్రవరి, 28 నుండి మార్చి 2 వరకు

# మీరు చూడజాలని గోడలకు ఆవల

## పూర్వాభిప్రాయాన్ని విశాల దృక్పథం భర్తీ చేసినప్పుడు

ప్రియ మిత్రులారా,

ఒక వ్యక్తికి వారసత్వంగా వచ్చిన ఇంటిలో ప్రతి గోడకూ రంగుటద్దాల కిటికీలు ఉన్నాయి. ప్రతీ అద్దం బయటి ప్రపంచాన్ని ఒకే రంగులో చూపిస్తుంది. నీలం రంగు అద్దం గుండా చూస్తే తోట విచారంగా కనిపిస్తుంది. ఎరుపు రంగు అద్దం గుండా చూస్తే అది భయంగొలిపేలా కనిపిస్తుంది. గోధుమ-పసుపు రంగు (యాంబర్) అద్దం గుండా చూస్తే ప్రతీదీ పాతబడి, వెలిసిపోయినట్లు కనిపిస్తుంది. అతను ఆ కిటికీల గుండా చూస్తూ ఎంతకాలం జీవించాడంటే, అవి రంగుటద్దాలన్న విషయాన్నే అతను మర్చిపోయాడు. తనకు కనిపిస్తున్న విధంగానే ప్రపంచం ఉందని అతను నమ్మేవాడు. ఒక వర్షాకాలపు సాయంత్రం, తుఫాను కారణంగా ఒక అద్దం పగిలి, ఆ పగిలిన ఖాళీ గుండా మునుపు తానెన్నడూ చూడని, పేర్లు కూడా తెలియని రంగులను అతను చూస్తాడు.

మనలో చాలామందిమి అలాంటి ఇంట్లోనే నివసిస్తున్నాము. మనకు వారసత్వంగా వచ్చిన ఈ రంగుల అద్దాలను మనం అమర్చలేదు. మన కుటుంబం, సంస్కృతి, సమాజం, మన స్వీయ అనుభవాల ద్వారా అక్కడ అవి పెట్టబడ్డాయి. ప్రమాదం ఆ రంగులలో లేదు, అసలు ఆ అద్దాలకు రంగు ఉందనే విషయాన్ని మనం మర్చిపోవడంలో ఉంది. మనం మన పూర్వాభిప్రాయాలతో ప్రపంచాన్ని చూస్తూ, మనం స్పష్టతతో చూస్తున్నామని నమ్ముతున్నాం. ఆధ్యాత్మిక జీవితానికి ఈ పూర్వాభిప్రాయ వైఖరే ప్రాణాంతకమైన కాలకూటవిషమని బాబూజీ అన్నప్పుడు, వారు ఈ స్థితినే చాలా ఖచ్చితంగా పోల్చిచెప్పారు.

## విజ్ఞతలా అనిపించే విషం

విషం అనేది ఒక ఆసక్తికరమైన పదం. ఇది ఒక సజీవ వ్యవస్థలోనికి ప్రవేశించి, లోపలనుండి దానికి హాని కలిగిస్తుందని దీని అంతరార్థం. విషం నిండిన శరీరానికి, నష్టం జరిగే వరకు తనలో విషం ప్రవేశించిందని తెలియదు. ఇప్పటి వరకు మనం చర్చించుకున్న అన్ని అడ్డంకులకంటే పూర్వాభిప్రాయవైఖరి ఎందుకు ప్రమాదకరమైనదో తెలియజేయడానికి ఇదే కారణం. లక్ష్యాన్ని మేల్కొల్పడం అనే సందేశంలో సోమరితనం కనిపిస్తుంది. బలమైన పునాదిని నిర్మించడం అనే సందేశంలో సందేహం అనేది అనుభవంలోకి వస్తుంది. ఆకాశాన్ని అందుకోవడం అనే సందేశంలో ఎవరైనా నిజాయితీగా తరచి చూడాలనుకుంటే గర్వం కనిపిస్తుంది. కానీ పూర్వాభిప్రాయవైఖరి? పూర్వాభిప్రాయ వైఖరి, విచక్షణ అనే ముసుగును ధరించి ఉంటుంది. ఇది సత్యం పట్ల విధేయతగానూ, అనుభవం ద్వారా సంపాదించిన విజ్ఞతగానూ, సరైన నిర్ణయం తీసుకునే పరిణతిచెందిన సామర్థ్యంగానూ కనిపిస్తుంది. పూర్వాభిప్రాయ వైఖరితో కూడిన మనస్సు తను సరిగా లేనని అనుకోదు; అది ఖచ్చితత్వంతో ఉన్నాననుకుంటుంది.

ప్రముఖ అమెరికన్ విద్యావేత్త జాన్ డ్యూయీ సంకుచిత మనస్తత్వాన్ని “అకాల మేధోపర వృద్ధాప్యం” అని పిలిచారు. మనస్సు తన మృదుగుణాన్ని కోల్పోతుంది. అది కొత్త విషయాలను స్వీకరించలేదు, విశ్లేషించలేదు మరియు స్పందించలేదు కూడా. ప్రస్తుతం ఏర్పడిఉన్న ఆకృతిలోకి సరిపోని ప్రతి కొత్త వ్యక్తిని, ప్రతి కొత్త ఆలోచనను, ప్రతి అనుభవాన్ని ఎప్పుడో ఏర్పచుకున్న పాత అభిప్రాయాల ద్వారానే అది వడగట్టుతుంది. మనం వాస్తవాలను ఎదుర్కోవడం మానేస్తాము; బదులుగా, వాస్తవికత గురించి మనకున్న అభిప్రాయాలనే ఎదుర్కొంటాము. ఆ రెండింటికీ మధ్య తేడాను గుర్తించలేక పొరబడుతూ ఉంటాం.

## అది దృఢతరం చేసే గొలుసు

బాబాజీ అంతర్దృష్టి, మనస్తత్వ శాస్త్రం కన్నా మరింత లోతులకి విస్తరించింది; ఆయన ఒక అధిభౌతిక పరిణామాన్ని గుర్తించారు. పూర్వాభిప్రాయ వైఖరి అనేది ఇప్పటికే ఉన్న అహంకారమనే గొలుసుకు మరొక కొక్కేన్ని జోడిస్తుందని ఆయన

అంటారు. దీని అర్థం ఏమిటో ఒకసారి ఆలోచిద్దాం. ప్రతి పూర్వాభిప్రాయ చర్య తన మూలంలో "నా దృక్పథమే సరైనది. నా యొక్క సమూహమే సరైనది. నేను చూసే విధానమే అసలైన విధానం." అనే ఒక ప్రకటనను కలిగి ఉంటుంది. ఇది ఇతరుల గురించి చేసే నిర్ణయంగా కనిపించినప్పటికీ, ప్రాథమికంగా ఇది స్వీయాత్మ గురించి చేసే ఒక ప్రకటన. ఇటువంటి ప్రతీ ప్రకటన, అహంకారం అనే పొరను మరింత మందంగా చేస్తుంది. ఏ సముద్రంలో అయితే తిరిగి కలవాలని ఒక నీటి బిందువు పరితపిస్తుందో, ఆ సముద్రం నుండి ఆ బిందువును వేరు చేసేదే ఈ అహంకారం.

అందుకే బాబూజీ - అనంతత్వాన్ని సాక్షాత్కరించుకోవడం అసాధ్యం అవుతుంది అనే ఒక విస్మయాత్మక తర్కానికి వస్తారు. కష్టతరమో లేదా అసంభవమో కాదు; అది అసాధ్యం అవుతుంది. పరిమితమైన గోడలు నిర్మిస్తూ మీరు అపరిమితమైన అనంతాన్ని చేరుకోలేరు. మీరు వేరుగా ఉండాలని పట్టుబడుతూ, సంపూర్ణత్వంలో లయం కాలేరు. తన చుట్టూ ఒక సరిహద్దు గీసుకుని, ఆ సరిహద్దుకు వెలుపల ఉన్నవన్నీ తక్కువైనవనీ, తప్పైనవనీ లేదా మరొకటని ప్రకటించే చైతన్యం, ఆ విశాలత్వాన్ని అనుభవించే అర్హతను నిర్మాణాత్మకంగానే కోల్పోతుంది. ఇది అత్యంత తార్కికమైన విషయం.

పరిమితమైన గోడలు నిర్మిస్తూ మీరు అపరిమితమైన అనంతాన్ని చేరుకోలేరు. మీరు వేరుగా ఉండాలని పట్టుబడుతూ, సంపూర్ణత్వంలో లయం కాలేరు. తన చుట్టూ ఒక సరిహద్దు గీసుకుని, ఆ సరిహద్దుకు వెలుపల ఉన్నవన్నీ తక్కువైనవనీ, తప్పైనవనీ లేదా మరొకటని ప్రకటించే చైతన్యం, ఆ విశాలత్వాన్ని అనుభవించే అర్హతను నిర్మాణాత్మకంగానే కోల్పోతుంది. ఇది అత్యంత తార్కికమైన విషయం.

## గోడగా తయారైన వారధి

బాబూజీ విశ్లేషణలో, ఈ పూర్వాభిప్రాయ వైఖరి ప్రభావం వల్ల మతానికి ఏం జరుగుతుందనేది బహుశా అత్యంత ఆలోచింపజేసే అంశం. మనిషికి, దైవానికి మధ్య ఒక వారధిలా ఉండవలసిన మతం, దానికి భిన్నంగా ఒక అడ్డంకిగా మారుతుంది. అనుసంధానించవలసిన సాధనమే, వేరు చేసే సాధనంగా మారింది. ఏ విధంగా? ఎప్పుడైతే మనం పవిత్రతను "నా మతం మాత్రమే నిజమైన మతం" అనే కోణంలో చూస్తామో, అప్పుడు దివ్యత్వపు సజీవ అనుభవం యొక్క స్థానంలో, రూపం పట్ల ఉండే ఒక నిర్జీవమైన విధేయత వచ్చి చేరుతుంది. పాత్రను పూజిస్తూ, అది తీసుకెళ్ళి ఉండవలసిన నీటిని గురించి మనం మర్చిపోతాము.

ఇది ఏదో ఒక సంప్రదాయానికి మాత్రమే పరిమితమైన సమస్య కాదు. చంద్రుడిని చూపిస్తున్న వేలును చూసి, అదే చంద్రుడు అని ఎక్కడైతే మనుషులు పొరబడతారో, అలాంటి ప్రతీచోటా ఈ సమస్య ఉంటుంది. ఒక ముస్లిం పక్కన కూర్చుని ధ్యానం చేయని హిందువులో ఇది ఉంటుంది. ఆధ్యాత్మిక అనుభవాలన్నీ నిరాధారమైనవని కొట్టిపారేసే శాస్త్రవేత్తలోనూ ఇది ఉంటుంది. నిజాయితీగా చెప్పాలంటే ఇది మనలో కూడా నిశ్శబ్దంగా ఉంటుంది. మనం ఇంకా పరీక్షించని మారుమూలల్లోనూ, అవి ఊహలు మాత్రమే అని మనం మరిచిపోయినటువంటి, మనకు బాగా తెలిసి ఉన్నటువంటి కల్పనలలో సైతం, అది దాగి ఉండవచ్చు.

## అద్దాన్ని కరిగించేది ఏమిటి

ఒక ఖాళీ కప్పును దేనితోనైనా నింపడానికి అవకాశం ఉన్నట్లు, నిర్మలమైన హృదయంలోనే ప్రేమకు చోటు ఉంటుంది. ప్రేమ అనేది మనం సృష్టించేది కాదు. సరైన పరిస్థితులు ఉన్నప్పుడు అది సహజంగా ఉద్భవిస్తుంది. పూర్వాభిప్రాయ వైఖరి అనేది లోతుగా పాతుకున్న, ప్రేమ ప్రవేశించడానికి వీలుగా, పెకలించి వేయాల్సిన వేర్లలో ఒకటి; ఇక్కడి అందమైన విషయం ఏమిటంటే, దీనికి వ్యతిరేకమైనది కూడా నిజమే! ప్రేమ కూడా పూర్వాభిప్రాయ వైఖరిని లోపలనుండి కరిగించి వేసే శక్తిగా పనిచేస్తుంది. భయం అనేది సంకోచించుకు పోయేలా చేస్తే, ప్రేమనేది విస్తరిస్తుంది. పూర్వాభిప్రాయ వైఖరి అనేది ఒక నిర్దిష్ట అభిప్రాయం

చుట్టూ మన చైతన్యం సంకోచించుకుపోవడం వల్ల ఏర్పడుతుంది కాబట్టి ప్రేమ నిజంగా విస్తరించినప్పుడు, అది నిలబడలేదు.

ఇక్కడే ధ్యానం అత్యావశ్యకమవుతుంది. అందరినీ ప్రేమించాలని మీతో మీరు వాదించి ఒప్పించలేరు లేక మిమ్మల్ని మీరు నిందించుకుని విశాలత్వాన్ని కొనితెచ్చుకోలేరు. లోతైన సాధన యొక్క నిశ్శబ్దంలో, ఆలోచనలు సద్దుమణిగి, మనస్సులోని అలజడి తగ్గినప్పుడు, ఒక అద్భుతం జరుగుతుంది. మనం నిర్మించుకున్న సరిహద్దులు కేవలం మనం నిర్మించుకున్నవి మాత్రమేనని అర్థమవుతుంది. ఆ సరిహద్దులు వాస్తవికత లేదా సత్యం కాదని, అవి కేవలం ప్రశ్నించాలని ఎన్నడూ మనం అనుకోనివైన, మన మనస్సు యొక్క అలవాట్లు, ప్రతిక్రియా ధోరణులు, వారసత్వంగా వచ్చిన తీర్మానాలు మాత్రమేనని మనం గ్రహిస్తాము.

దివ్య ప్రసారమైన, ప్రాణాహుతి ద్వారా, మనస్సు యొక్క పరిధుల కంటే విశాలమైనదానితో ప్రత్యక్ష సంబంధం ఏర్పడి, హృదయం మృదువుగా మారుతుంది. ఆ విస్తారతలో పూర్వాభిప్రాయ వైఖరికి తావుండదు; మనం దానితో పోరాడి గెలవడం వల్ల కాదు, అది ఆక్రమించి ఉండిన ప్రదేశం కంటే మనం మరింత ఎక్కువగా విస్తరించడంవల్ల అది అదృశ్యమవుతుంది. సముద్రంలో కలిసిన నది, తాను ప్రవహించిన లోయ గురించి ఆలోచించదు. ఎందుకంటే అది అలాంటి చిన్న పరిమితులకు మించి ఎంతో ఉన్నతంగా మారిపోయింది.



దివ్య ప్రసారమైన, ప్రాణాహుతి ద్వారా, మనస్సు యొక్క పరిధుల కంటే విశాలమైనదానితో ప్రత్యక్ష సంబంధం ఏర్పడి, హృదయం మృదువుగా మారుతుంది. ఆ విస్తారతలో పూర్వాభిప్రాయ వైఖరికి తావుండదు; మనం దానితో పోరాడి గెలవడం వల్ల కాదు, అది ఆక్రమించి ఉండిన ప్రదేశం కంటే మనం మరింత ఎక్కువగా విస్తరించడంవల్ల అది అదృశ్యమవుతుంది.

# అద్దంలోని పగులు

పూర్వాభిప్రాయ వైఖరి కేవలం దాన్ని కలిగి ఉన్న వ్యక్తిని మాత్రమే కాకుండా, బయట ప్రపంచాన్ని కూడా నష్టపరుస్తుంది. ఇతరులు దానిని గమనిస్తారు, పిల్లలు దానిని అలవర్చుకుంటారు, కనిపించని వాటి రేఖల వెంట సమాజాలు ముక్కలవుతాయి. భారతదేశానికి రాజకీయ స్వేచ్ఛ వచ్చింది కానీ ఆత్మకు స్వేచ్ఛ రాలేదని బాబూజీ వ్రాసినప్పుడు, అంతర్గత విముక్తి లేని బాహ్యపరమైన విముక్తి అసంపూర్ణమైనదనే ఒక శాశ్వత సత్యాన్ని వారు గుర్తించారు.


మన అంతర్గత వాతావరణాన్ని పరిశీలించుకోవాల్సిన బాధ్యత మనలో ప్రతి ఒక్కరి పైనా ఉంది. ఈ ఆత్మపరిశీలన అపరాధభావంతో చేయనక్కర్లేదు, ఎందుకంటే అపరాధభావన కూడా ఒక రకమైన సంకోచించడమే. దానికి బదులుగా, నిజాయితీ కూడిన కుతూహలంతో ఇలా ప్రశ్నించుకోండి: “వినడం నేను ఎక్కడ ఆపేశాను?”, “ఎటువంటి తాజా ఆధారమూ లేకుండానే, ఒక వ్యక్తిగానీ , ఒక మార్గంగానీ  లేదా ఒక ఆలోచనగానీ నాకు ఏమీ ఇవ్వలేవని నేను ఎక్కడ నిర్ణయించుకున్నాను?”, “వాస్తవత్వపు సౌకర్యాన్ని, సత్యము యొక్క అస్తిత్వమని నేను ఎక్కడ పొరబడ్డాను?”

వారసత్వంగా వచ్చిన ఆ ఇంట్లో నివసించే ఆ మనిషి తన కిటికీలను ధ్వంసం చేయవలసిన అవసరం లేదు. అతనికి కావలసింది కేవలం ఒక చిన్న పగులు, స్వచ్ఛమైన కాంతి ప్రవేశించగలిగే ఒక చిన్న రంధ్రం. ఆ పగులే ఆధ్యాత్మిక స్వేచ్ఛకు ఆరంభం: ఇది మరిన్ని సరైన సమాధానాలను సేకరించడం కాదు, మన దగ్గర ఉన్న సమాధానాలను తేలికగా  పట్టుకుని, మనల్ని నిరంతరం ఆశ్చర్యపరచడానికి, మనల్ని మలచడానికి, అపారమైన వాస్తవికతకు అవకాశాన్నివ్వడం.

మనం చూడజాలని గోడలను తొలగించడం ఎల్లప్పుడూ కష్టమే, కానీ ఈ పనిని విలువైనదిగా చేసే ఒక నిశ్చల సత్యం ఉంది: మనం ఆ గోడలను బలవంతంగా పడగొట్టం. మనం వాటి లోపల ఇమడలేనంతగా విస్తరించడం ద్వారా వాటిని కరిగించివేస్తాము. ఆ గోడలు కరిగిపోతుంటే, ఆ ఖాళీ ప్రదేశంలో ఒక కొత్త

చైతన్యం కదలడం ప్రారంభిస్తుంది, అక్కడ ఒక అస్తిత్వం ఎప్పటి నుండో ఎదురుచూస్తోంది. దీని గురించి మనం తదుపరి సందేశంలో తెలుసుకుందాం: ఎప్పుడైతే ప్రేమ అన్ని అడ్డంకుల నుండి విముక్తి పొంది, తన సంపూర్ణ శక్తితో దైవం వైపు మళ్లుతుందో, అదే భక్తిగా మారుతుంది.

ప్రేమతో, ప్రార్థనలతో
**కమలేష్**



## దాజీతో మాస్టర్ క్లాసులు

హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానాన్ని మీరెప్పుడైనా ప్రారంభించవచ్చు. మూడు భాగాల మాస్టర్ క్లాసుల కోసం దాజీతో కలవండి. వాటిలో వారు హార్ట్‌ఫుల్‌నెస్ పద్ధతి యొక్క ప్రయోజనాలను చెబుతారు. మీ దైనందిన జీవితానికి హార్ట్‌ఫుల్‌నెస్ రిలాక్సేషన్, ధ్యానం, నిర్మలీకరణ, ప్రార్థనలను ఎలా జోడించవచ్చో వారు వివరిస్తారు. మాస్టర్ క్లాసులన్నీ ఉచితమే.

https://heartfulness.org/global/masterclass/

## హార్ట్‌ఫుల్‌నెస్ సాధనా పద్ధతులు

హార్ట్‌ఫుల్‌నెస్ సాధనా పద్ధతులను కనుగొనండి. రిలాక్స్ అవడం, ధ్యానం చేయడం, నిర్మలీకరణ చేయడం, ప్రార్థన చేయడం నేర్చుకోండి.

https://heartfulness.org/in-en/heartfulness-practices/

heartfulness

purity weaves destiny

